పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలి

- గత ఓటర్ల జాబితాలో పేరు ఉందని భ్రమ పడవద్దు
- నవంబర్ 7లోగా ఓటరుగా నమోదుకావాలి
- కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పిలుపునిచ్చారు. జిల్లాలో అధిక సంఖ్యలో పట్టభద్రులు ఉన్నప్పటికీ ఓటరు నమోదు తక్కువగా ఉందన్నారు. గత ఓటరు జాబితాలో పేరు ఉందనే భ్రమలో ఉండవద్దని, ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఓటరుగా నమోదు కావలసిన అవసరం ఉందని చెప్పారు. కావున జిల్లాలో డిగ్రీ పొందిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రులు ఫారం-18 సమర్పించి ఓటరుగా నమోదు కావచ్చని, తమ సమీప బి.ఎల్.ఓ /ఎం.పి.డి.ఓ/తహసీల్దార్లకు ఓటరు నమోదు ఫారాలను అందజేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరుగా నమోదు అయ్యేందుకు నవంబర్ 7వ తేదీ వరకు అవకాశం ఉందని, కావున ఈలోగా ఫారం-18లను సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ వివరించారు. సందేహాల నివృత్తి కొరకు కలెక్టర్ కార్యాలయం కాల్ సెంటర్ నెంబరు 1950 లేదా 08942-240546నకు సంప్రదించగలరని కోరారు.

పూర్వీకుల ఆచారాలను భావితరాలకు అందిద్దాం

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పూర్వీకుల అచార వ్యవహారాలను భావితరాలకు అందిద్దామని పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆయన శనివారం తన స్వంత గ్రామం నిమ్మాడకు చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఆయన బాబాయ్ మాజీ పీఏసీఎస్ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అలనాటి అచార వ్యవహారాలు అంతరించపోతుండడం వల్లనే మనుషులు మధ్య సత్సంబంధాలు దూరమవుతున్నాయని ఇటువంటి పండగల సమయాలలోనైనా ఎక్కడ ఉన్నవారైన స్వగ్రామానికివచ్చి అందరితో కలిసి సంతోషాలు పంచుకోవాలని హితవు పలికారు. ఈ చవితి రోజున పుట్టలో పాలు పోసి గుడ్లు వేయటం వల్ల చెవులకు సంబందించిన వ్యాధులు రావని, వచ్చిన వ్యాదులు నయమవుతాయని ప్రజలు నమ్ముతారు. అలాగే చవితి రోజు నాగుపాము కనిపిస్తే ఆ కుటుంబానికి శుభం చేకూరి సుభ్రమణ్యస్వామి ఆశీస్సులు లభిస్తాయని వేద పండితులు చెబుతున్నారు. ఇక చవితి పండగ సందర్భంగా మధ్యాహ్నం మహిళలంతా పంట పొలాలకు వెళ్ళి పూజలు నిర్వంచటం వల్ల యేడాది మొత్తం పంటలు సమృద్ధిగా ఉంటాయని భావిస్తున్నారు.

అత్యుత్తమ రవాణా సంస్థ ఆర్టీసీ

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావుతో సంబంధిత అధికారులు కొత్త ఆర్టీసీ బస్సును ప్రారంభింపజేశారు. మొత్తం 26 బస్సులు కొనుగోలు చేశారు. అందులో ఒకటి పెద్దపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన ప్రారంభిచారు. ప్రయాణికులు ఆర్టీసీ అందించే సౌకర్యాల్ని వినియోగించుకోవాలని ధర్మాన కోరారు. అదే విధంగా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆర్టీసీ సంస్థకు చెందిన బస్సులు నడుపుతుందని అన్నారు. ఆర్టీసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాక ఉద్యోగుల జీతభత్యాల విషయమై కానీ, సంస్థ ఉన్నతి విషయమైకానీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. గ్రామీణ ఆంధ్రావనికి ఆర్టీసీ అందిస్తున్న సేవలు, సంబంధిత ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటే మరిన్ని మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. కాగా విలేకరులతో మాట్లాడుతూ.. భూమి లేని నిరుపేదలకు అర్జీ పెట్టుకుంటే అర్హతల మేరకు వారి దరఖాస్తు పరిశీలించి తగు న్యాయం చేస్తామని, ఇందుకు స్థానిక సచివాలయాలను సంప్రదించాలని కోరారు. 12 వేల కోట్ల రూపాయలు వెచ్చించి భూములను తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందని అన్నారు.

ఆ నిర్మాణం సక్రమమే...

ఫిర్యాదుపై అధికారుల సమక్షంలో అనుమతులు పరిశీలన

విశాలాంధ్ర-సోంపేట : ఇటీవల సోంపేట మేజర్ పంచాయతీ బిరుసువాడ గ్రామంలో నిర్మాణమవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అక్రమ నిర్మాణమంటూ పలువురు కలిసి సోంపేట పంచాయతీ ఈఓకు ఫిర్యాదుచేసి వివిధ పత్రికల ద్వారా ప్రకటనలు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సదరు నిర్మాణదారు దుద్ది శ్రీనివాసరావు తదితరులు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి సదరు అధికారులకు అదే కార్యాలయం నుంచి గతంలో పొందిన ప్లాన్ అప్రూవల్ అనుమతులను చూపించారు. 2019లో మంజూరు కాబడిన అనుమతులను పనులు ఆలస్యమైనందున 2021లో వాటిపై అదే కార్యాలయం ద్వారా రెన్యువల్ చేయించుకున్నట్లు ఆధారాలను కూడా అధికారులకు చూపించారు. ఆధారాలు పరిశీలించిన పంచాయతీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ పనులు కొనసాగించుటకు ఎటువంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. సదరు అనుమతులు దుద్ది శ్రీనివాసరావు తండ్రి చిన్నారావు, తల్లి దానమ్మ పేరిట ఆమోదం పొంది ఉన్నట్లు వివరించారు. దీనిపై నిర్మాణదారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై వ్యక్తిగత కక్షతో ఎంతోకాలంగా ఇటువంటి ఫిర్యాదులు, ఆరోపణలు చేయడం దురదృష్టకరమని అన్నారు. అక్రమంగా వ్యాపారం చేయాల్సిన అవసరం తనకు లేదని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో 3 పూరిల్లు దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తరపున బొరివంక గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మాధవి ఆనంద్ రౌలో ఆర్థిక సహకరంతో 3 కుటుంబాలకు 2 నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలతోపాటు ఆర్థిక సాయంగా ఒక్కో కుటుంబానికి 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొరివంక గ్రామ సర్పంచ్ బెందాలం శ్రీరామ్ ప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజు సాహు, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు రమేష్, సభ్యులు గణేష్, దేవా, గ్రామ యువత పాల్గొన్నారు.

పవర్ బోర్లు వేస్తారా... రద్దు చేస్తారా..!

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు ఆగ్రహం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంజూరు చేసిన పవర్ బోర్లు వేస్తారా.. లేక రద్దు చేస్తారా అంటూ కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ బోర్లు వేయనప్పుడు వేసిన బోర్లకు మోటార్లు బిగించనప్పుడు అటువంటి కాంట్రాక్టర్లను మార్చి వేరేవారికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్న పవర్ బోర్లు ఎందుకు వేయడంలేదని, తాగునీరు కోసం రామలక్ష్మణకాలని, హట్కోకాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని అన్నారు. తాగునీరు సరఫరా చేయనప్పుడు వారి నుంచి నీటి పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిలర్ ఆశారాణి మాట్లాడుతూ పలాస కొత్తవీధిలో పవర్ బోరు వేసి 19 నెలలు అవుతున్నా మోటారు నేటికి బిగించలేదని అన్నారు. అలాగే కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ తాళభద్రలో పవర్ బోరుకు ఎందుకు మోటారు భిగించలేదని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 6 కోట్ల రూపాయలు పన్నుల రూపంలో ఆదాయం రావాల్సి ఉండగా గతేడాదితో పాటు ఈ ఏడాది కలుపుకొని 4.50 కోట్ల రూపాయల పన్నులు పెండింగ్‌లో ఉండడం వలనే పనులు చేయలేకపోతున్నా మని అన్నారు. మరో 15 రోజుల్లో పవర్ బోర్లుకు మోటార్లు వేసి తాగునీరు అందిస్తామని అన్నారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ పవర్ బోరు వేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. పని చేయని కాంట్రాక్టర్లను పక్కన పెట్టి వేరే వారికి కాంట్రాక్టర్లు అప్పజెప్పాలని అధికారులకు ఆదేశించారు. ఇంటింటికి కొలాయి ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు 97 కోట్లతో పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇటీవల సంత మైదానంలో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కాశీబుగ్గ బార్ అండ్ రెస్టారెంట్ ఎందుకు చర్యలు చేపట్టడం లేదని అధికారులకు నిలదీశారు. పూర్తిస్థాయిలో అనుమతి లేకపోయినా బార్ ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ రాజగోపాల్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఫ్లెక్సీలు ఎక్కడ పెట్టరాదని, ఫ్లెక్సీలు తయారు చేసిన షాపులపై అపరా రుసుం వసూలు చేయడం జరుగుతుందని అన్నారు. ఫ్లెక్సీలు నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, మున్సిపల్ విప్ దుర్గాశంకర్, వజ్జ బాబూరావు, డి.ఈ.ఈ బల్ల హరిలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-సోంపేట : ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలను పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేపట్టేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని స్థానిక ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. ఆయన శనివారం ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, ఎంపిడిఓ బెందాళం వెంకటరమణ, హౌసింగ్ డిఇ ఆర్.ఎస్.ప్రసాద్, హౌసింగ్ ఎఇ శివరామకృష్ణ, మండల ఇంజనీరింగ్ అధికారి రమేష్, తదితరులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ జగనన్న కాలనీలో కొండవాలును సమాంతరం చేసి పటిష్టంగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. సంబంధిత అధికారులు పనుల్లో ఎటువంటి లోపాలు లేకుండా ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు భీమారావు, తోట ఢిల్లీరావు, ఎంపిటిసి పొడుగు కామేష్‌తదితరులు పాల్గొన్నారు.

గ్రంధాలయానికి రూ.25వేలు వితరణ

విశాలాంధ్ర-పలాస: మండలం నీలావతి ఉద్దాన విద్యాభివృద్ధి వేధిక గ్రంధాలయానికి రామక్రిష్ణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రెయ్యి కోదండకృష్ణ 25వేల రూపాయలు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని, గ్రంధాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో యు.వి.వి.ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, అధ్యక్షులు ఇ.జోగారావు. బత్తిని ఓంకార్, రెయ్యి కృష్ణారావు, కె.ప్రకాశరావు, పి.గీతమ్మ, కుత్తుం సుధాకర్‌లు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మేజర్ పంచాయతీలో, సర్పంచ్ కలింగపట్నం లక్ష్మీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో, కాలువల్లో పేరుకుపోయిన చెత్త ఎట్టివేయించారు. ఈకార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు, ప్రజా వైద్యులు డాక్టర్ కలింగపట్నం అప్పారావు, పంచాయతీ కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు, గ్రామ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

పోలీసు అంటేనే త్యాగం : జిల్లా జడ్జి గోపి

- సమాజ రక్షణ... మా బాధ్యత..
- జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : పోలీసు అంటే త్యాగమని అలాంటి నిస్వార్థమైన త్యాగాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి పిలుపునిచ్చారు. అమర వీరుల స్మారక ఉత్సవాలు సందర్భంగా శనివారం ఉదయం స్థానిక బాపూజీ కళామందిర్‌లో పోలీసుల త్యాగాలు అనే అంశంపై జిల్లా పోలీసు శాఖ జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, అధ్యక్షతన నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి జిల్లా జడ్జి జి. గోపి ముఖ్య అతిథిగా, జాయింట్ కలెక్టర్ నవీన్, అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటారావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జి.గోపి మాట్లాడుతూ సమాజంలో చెడును సృష్టించేందుకు దుష్ట శక్తులు లక్షణమైతే ప్రజలతోపాటు, దుష్ట శక్తులను కాపాడాలని లక్షణం గల వ్యక్తులే పోలీసులని ఎంతమంది ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినప్పటికీ విధినిర్వహణలో సమాజంలో ధన, మాన, ప్రాణ రక్షణకై తన ప్రాణాలు సహితం త్యాగం చేసిన వ్యక్తులే పోలీసులని తెలిపారు. పోలీసులు త్యాగాలు వృధా కాకుండా చూడవలసిన బాధ్యత యువకులపైన ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. విద్యార్థులు స్థాయికి మించి ఆలోచించకుండా ఉన్నదానితో సంతృప్తి పొందాలంటే మనస్సు నియంత్రణ శక్తి కలిండాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడంతోపాటు తనకుతాను స్వయం ప్రకటిత క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. నేరప్రవృత్తిలేని సమాజాన్ని నిర్మించాలంటే విద్యార్థులు విద్యార్థి దశ నుంచి మంచి లక్షణాలు అలవర్చుకోవాలన్నారు.

జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రెండు సంవత్సరాలు ప్రజల ప్రాణాలు రక్షణకై ఫ్రెంట్ లైన్ వారియర్స్‌గా ముందు వరుస ఉండి మా పోలీసులు చేసిన త్యాగాలు నిస్వార్థమైనవి ఎస్పీ కొనియాడారు. కరోన కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 900 మంది ప్రాణాలు కోల్పోయారుని తెలిపారు. మనదేశంలో ఇతర దేశాలతో పోల్చుకుంటే లక్షకు 150 మంది పోలీసులే ఉన్నారని తద్వారా ప్రతి పోలీసుపై పనిఒత్తిడి పెరుగుతుందని ఆమె తెలిపారు. పోలీసు ఉద్యోగం అనేది క్రమశిక్షణతో కూడినదన్నారు. సెలవులు, సమయం, సంఘాలు ఉండావుని, సమాజంలో ఉన్న కొంతమంది దుష్ట శక్తులు నుంచి ప్రజలను కాపాడివల్సిన శాఖ పోలీసు శాఖేనని ఈ సందర్భంగా ఎస్పీ గుర్తు చేశారు. సురక్షితమైన సమాజం నిర్మించడం మా భాధ్యతని ఎస్పీ హితవు పలికారు. సెలవులు ఉన్న లేకున్నా సమాజ శ్రేయస్సు కోసం పోరాడిన వ్యక్తి పోలీసు ఒక్కరేనని, 24/7 విధి నిర్వహణలో ట్రాఫిక్, బందోబస్తు, శాంతి భద్రతల పరిరక్షణ, కొట్లాట, విఐపిల భద్రత, దొంగతనాలు అరికట్టేందుకు విధిలతో పాటు నిముషం ఖాళీ లేకుండా పోలీసులు చేస్తున్న త్యాగాలకు ప్రాధాన్యత సంతరించుకుండాలంటే ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించి, తప్పకుండా చట్ట ప్రకారం నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని ఆమె కోరారు.

జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ మాట్లాడుతూ 24 గంటలు, సెలవులు లేకుండా, ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్యామిలీ లైఫ్ ని త్యాగాలు చేసే వారు ఒక పోలీసు ఉద్యోగమేనన్నారు. ప్రజా భద్రతకై రాత్రి పగలు తేడా లేకుండా నిస్వార్థంగా పోలీసులు విధిలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎన్.వెంకటారావు, జిల్లా అదనపు ఎస్పీ కె శ్రీనివాసరావు, డీఎస్పీ ఎం. మహేంద్ర, సిఐ సన్యాసినాయుడు ఎస్సైలు పలు కళాశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం జెడ్పీటీసీ పరిశీలన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలోని పెద్దకోమటివీధి ప్రాథమిక పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును జెడ్పీటిసి సభ్యురాలు తడక యశోద, మండల వైకాపా కన్వీనర్ తడక జోగారావు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీ లించారు. మధ్యాహ్న భోజనం సంతృప్తికరంగా ఉందని అన్నారు. వీరితోపాటు ఎంపిటిసి బొమ్మిడి ధర్మరాజు, నర్తు జోగారావు, దొండపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీవ్యాధితో మహిళ మృతి

విశాలాంధ్ర-పలాస : మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల దానమ్మ(50) కిడ్నీవ్యాధితో శనివారం మృతి చెందింది. గత రెండు రోజులు ఆరోగ్యం పాడవడంతో కాశీబుగ్గ ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. గత మూడేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ ఉండేదని, మృతురాలికి వివాహం కాకపోవడంతో వాళ్ల ఇద్దరు అన్న దమ్ములు బాగోగులు చూసేవారని స్థానికులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-ఆమదాలవలస: గడపగడపకు మన ప్రభుత్వం లో వచ్చిన ఫిర్యాదులు, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కోసం సచివాలయ పరిధిలో 20 లక్షలు మంజూరయింది. అందుకు సంబంధించిన పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. గడప గడప కి ఫిర్యాదులు వార్డు లకు మంజూరు అయిన గ్రాంట్స్ తో 16వార్డు లో కూరగాయలు మార్కెట్ వద్ద సిమెంటు రోడ్డు, కల్వర్ట్, వరదా వారి క్వార్టర్స్ వద్ద డ్రైనేజీ, శివన్నారాయణ క్వార్టర్స్ వద్ద కల్వెర్ట్ పనులు ప్రారంభం జరిగింది. మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ ఆధ్వర్యంలో వార్డు ప్రతినిధులు జె వెంకటేశ్వర రావు, శ్యాం ప్రసాద్ తదితరులు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల్ని మరువలేం

విశాలాంధ్ర-టెక్కలి : పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో డిస్ట్రిక్ట్ పోలీస్ బ్యాండ్ షోను డీఎస్పీ శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో టెక్కలి ఎస్‌ఐ సిహెచ్ హరికృష్ణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను మర్చిపోలేమని వాళ్ల త్యాగాలు పలువురికి ఆదర్శం కావాలన్నారు. ఎస్ డిపిఒ కాశీబుగ్గ ఆధ్వర్యములో డిస్ట్రిక్ట్ పోలీస్ బ్యాండ్ షోను నిర్వహించారన్నారు. ఈకార్యక్రమంలో టెక్కలి ప్రెసిడెంట్ జి. సుజాత, టెక్కలి మున్సిపల్ ఈఒ రామారావు, నందిగాం, సంతబొమ్మాళి, కొత్తూరు ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న స్పోర్ట్స్ క్లబ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-కవిటి : జగనన్న స్పోర్ట్స్ క్లబ్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పి.సూర్య నారాయణ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని నిర్మాణాలు చేపడుతున్న ఎస్ డబ్ల్యు పిసి (చెత్త తో సంపద కేంద్రాలు) 15 రోజుల్లో నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బిల్లులు, గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెల్లించాలని తెలిపారు. ఈ

వైసీపీతోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర-మందస : వైసీపీ ప్రభుత్వంలోనే గ్రామాలాభివృద్ధి చెందుతున్నాయని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. శనివారం మండలంలో కొంకాడా పుట్టి పంచాయతీ కిల్లోయి గ్రామంలో 16 లక్షల ఐటీడిఎ నిధులతో నిర్మించనున్న అంగన్వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పిటీసి సవర చంద్రమ్మ, అంగున్న సూర్యారావు, వైస్ ఎంపిపి సీర ప్రసాద్, కె.ఆదినారాయణ, సర్పంచ్ మజ్జి కుమార్ చంద్రలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు : ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర-హిరమండలం : రాష్ట్ర ప్రజానీకానికి పార్టీలకతీతంగా వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు పథకాలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 175 అసెంబ్లీ సీట్లకు 175 సీట్లు శత శాతం గెలిపించి ప్రతిపక్షం లేకుండా చూడాలని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రజలను వేడుకొన్నారు. శనివారం మండలంలోని భగీరదీపురం పంచాయతీలోని గిరిజన గ్రామలైన మామిడి జోల, ముగడపేట, గోడియాపాడు తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సీఎం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వచ్చాయా లేదా, ఇంకా ఏమికావాలి గ్రామ అభివృద్ధి తదితర విషయాలు ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పిఎసిఎస్ అధ్యక్షులు అంధవరం వెంకట్ సురేష్, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు మీసాల రామకృష్ణ, మండల ప్రత్యేక సలహాదారులు టి తిరుపతిరావు, మండల కో-అప్షన్ మెంబర్ పండా ప్రసాద్, సర్పంచ్‌లు బొజ్జమ్మ, వంజరాపు చిరంజీవి, గొర్లె సురేష్, వి బాలరాజు తదితరులు ఉన్నారు.

జమినివలసలో మౌలిక సదుపాయాల కొరత

విశాలాంధ్ర-జలుమూరు: మండలం మర్రివలస గ్రామ పంచాయతీ పరిధి జమినివలస గ్రామంలో మౌలిక సదుపాయాలు కొరత ఉందని ఆదివాసి గిరిజన చైతన్య వేదిక కమిటీ మండల అధ్యక్షుడు రాంప్రసాద్ తెలిపారు. ఈ గ్రామం కొండకి దగ్గర ఉండడంతో గ్రామానికి చుట్టుప్రక్కల గోడతోపాటు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సంబంధిత అధికారులు స్పందించి మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు.

డిగ్రీ ఇన్‌స్టెంట్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డా.బీఆర్ అబేంద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఇన్‌స్టెంట్ పరిక్షా ఫలితాలను శనివారం వీసీ ప్రొ. నిమ్మ వెంకటరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 5వ సెమిస్టర్‌లో 262 మంది హాజరు కాగా, 259, ఆరవ సెమిస్టర్‌లో 149కి 147 మంది ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ రీవాల్యూషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు. అంబేద్కర్ వర్సీటీ, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పీజీ, డిప్లొమా కోర్సులకు సంబంధించిన 2, 4 సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలు వర్సిటీ కేంద్రంగా ఉదయం 9నుంచి 12గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు నవంబర్ 4వ తేదీ లోగా రూ.1050లు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

అమ్మో విద్యుత్ బిల్లు..!



విశాలాంధ్ర-నందిగాం: మండలం పెద్ద తామరపల్లి గ్రామానికి చెందిన కొర్లాపు లక్ష్మీనారాయణకు అధిక మొత్తంలో కరెంటు బిల్లు వచ్చింది. దీంతో ఆయన ఆందోళన చెందుతూ మాది పేద కుటుంబం మా ఇంటికి ఒక బలుపు ఒక ఫ్యాను ఉంది. అది కూడా రాత్రి సమయంలో ఫ్యాన్ వేసుకుంటాం మాకు సెప్టెంబర్ నెలకు సంబంధించి వచ్చిన విద్యుత్ బిల్లు రూ.20,698 నా మీటరు కు వచ్చిందని లబోదిబో మంటున్నాడు. ఇంత బిల్లు నేను ఎలా కట్టాలని ప్రశ్నిస్తున్నాడు. దీనిపై విద్యుత్ ఏఈకి వివరణ కోరగా, పరిశీలించి విద్యుత్ మీటరును తక్షణమే మారుస్తామని విద్యుత్ శాఖ ఇన్చార్జి ఏఈ ఈశ్వరరావు పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

విశాలాంధ్ర-పాలకొండ: పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 800 మందికి పైగా పట్టభద్రులు ఉన్నారని, ఇంత వరకు 307 మంది ఓటర్లుగా నమోదు చేసుకోవడం జరిగిందని, తాత్సర్యం చేయొద్దని, త్వరితగతిన నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. ఆయనతోపాటు వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్, తదితరులు ఉన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు పరిశీలన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీకి చెందిన సోలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కులో పనులు జరుగుతున్న తీరును శనివారం మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్, ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మిల, హెల్త్ అసిస్టెంట్ ఉపేంద్రతో కలిసి గుంటూరుకు చెందిన తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు సందర్శించారు. అక్కడ చేపడుతున్న పనులను పరిశీలించారు. తడి పొడి చెత్తలను వేరుచేసి చేపడుతున్న బయోరిమిడియేషన్ ప్రక్రియను పరిశీలించారు. పార్కు ఆవరణ మొత్తం సర్వే చేసి కొలతలు తీసుకోవడంతో పాటు అక్కడ సి.సి కెమెరాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించారు.

టీడీపీ అధినేత బాబుతో కలమట భేటి

విశాలాంధ్ర-కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గ తాజా రాజకీయ పరిస్థితులు, అధికార వైసీపీ పాలన వైఫల్యాలపై చేపట్టిన నిరసనలకు సంబంధించి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణతో శుక్రవారం అమరావతి, ఉండవిల్లిలో టీడీపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఒన్ టూ ఒన్ సమీక్ష నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై టీడీపీ జరిపిన తాజా సర్వేలో అంశాలను కలమటతో పార్టీ అధినేత బాబు మాట్లాడారు. ముమ్ముందు పార్టీ పటిష్టత, తదితర అంశాలను చర్చించారు. రానున్న ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా కార్యక్రమాలు చేపట్టాలని అధినేత బాబు సూచించారని, మీడియాకు మాజీ ఎమ్మెల్యే కలమట తెలిపారు.

వరహా అవతారంలో జనార్ధన స్వామి

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువలో ప్రసిద్ధి గాంచిన బ్రహ్మ జనార్ధన స్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామి వారికి ప్రతిరోజు వివిధ అవతారాలను నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి వారు వరహా అవతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారం భక్తులను ఎంతగానో అలరించింది. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

దువ్వానపేటలో పౌరహక్కుల సదస్సు

విశాలాంధ్ర-రణస్థలం : కోష్ట పంచాయతీ, దువ్వనపేట గ్రామంలో పౌర హక్కుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్మశానవాటిక దారిలో ఆక్రమణ తొలగించాలని, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని సదస్సులో కోరారు. ఈ సదస్సులో సర్పంచ్ పిసిని చిన్నం నాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిసిని లక్ష్మణ రావు, వైస్ ప్రెసిడెంట్ కోలా రాంబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు పైడి శ్రీనివాస రావు, పీసిని జగన్నాధం నాయుడు, తహాశీల్దార్, ఎంపీడీవో ఇతర మండల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

లిబరేషన్ పార్టీపైన వస్తున్న దుష్ప్రచారాలను ఖండించండి

విశాలాంధ్ర-పలాస : గత రెండు రోజులుగా సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ పార్టీపై అసత్య ప్రచారాలను, అసంఘిక శక్తులు, పాలక పక్షాలతో కలిసి చేస్తున్న దుష్ప్రచారాన్ని సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు తీవ్రంగా ఖండించారు. కాశీబుగ్గలో శనివారం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా గ్రామంలో అశాంతిని నెలకొల్పుతున్న తామాడ అప్పారావు, గేదెల నారాయణ, మామిడి కమల, వాళ్లతో మరి కొద్ది మందితో కలిసి ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికైనా సోషల్ మీడియా దుష్ప్రచారం ఆపకపోతే పార్టీపరంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంటుందని హెచ్చరించారు. మండలంలో బొడ్డపాడు రెవిన్యూ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించే పోరాటంలో లిబరేషన్ పార్టీ ముందు ఉంటుందన్నారు. సమావేశంలో ఎం.రామారావు, ఈశ్వరమ్మ, కామేశ్వరరావు, అప్పారావు, కైలాస్, రామక్రిష్ణలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నెఫ్రాలజిస్టు వైద్యులు

విశాలాంధ్ర-పలాస : పలాస ప్రభుత్వాసుపత్రిలో ప్రతి శనివారం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నెఫ్రాలజీస్టు వైద్యులు అందుబాటులో ఉంటారని, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్ తెలిపారు. పలాస ప్రభుత్వాసుపత్రిలో శనివారం కిడ్నీరోగులకు నెఫ్రాలజిస్టు డాక్టర్ విద్యాసాగర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేసే కార్యక్రమంలో భాగంగా 50 కోట్ల రూపాయలతో 200 పడకల ప్రభుత్వాసుపత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నారని, ప్రస్తుతం 70శాతం పనులు పూర్తయ్యాయని, మరికొద్ది నెలల్లో ప్రజలకు అందుబాటులో తీసుకు వస్తామన్నారు. పనులు ముమ్మరంగా జరగడానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కిడ్నీవ్యాధిగ్రస్తులు డయాలసీస్ దశలో ఉన్న వారు తప్పనిసరిగా ప్రతి శనివారం ప్రభుత్వాసుపత్రిలో ఉచిత రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఎం.రమేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

ఏపీజీబీసీ చైర్మన్ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం నెలకుంటుందని ఏపీజీబీసీ చైర్మన్ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీజీ అండ్ బీసీ చైర్మన్ నర్తు రామారావు చేతుల మీదుగా ఏపీజీ అండ్ బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నర్తు రామారావు మాట్లాడుతూ పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం వలన విద్యార్థులకు ఒక ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి, ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యుడు కె. నాగబాబు జన్మదినాన్ని ఆ పార్టీ ప్రతినిధులు శనివారం ఉత్సాహంగా నిర్వహించుకుని, స్థానిక సి.హెచ్.సిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేసారు. స్థానిక ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రతినిదులు సంతోష్ మహరణ, డిల్లీ బిసాయ్, దాసరి శేఖర్, కలియా, బాస్కర్ తదితరులు ఉదయం శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు జరిపించిన అనంతరం పుట్టిన రోజు పురస్కరించుకుని రోగులకు పండ్లు పంపిణీ చేసారు.

ఆలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ ఆనంద్ విరాళం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బొరివంక గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ అసిరి పోలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మాధవిఆనంద్ రౌలో దంపతులు మూడు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శనివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ బెందాలం శ్రీరామ్ ప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్ తో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులకు చెక్కును ఎన్నారై బంధువు విజయ గోపాలరావు ద్వారా అందజేశారు. ఈ విరాళంతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం భారీ రేకు షేడ్ ను నిర్మిస్తున్నట్లు సర్పంచ్, ఎంపీటీసీ, ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెందాలం విజయ్ కృష్ణ, గ్రామ పెద్దలు బాబురావు, ధనుంజయం, ఆనంద్, తేజేశ్వరరావు, జయప్రకాష్, వినోద్, కోటేశ్వరరావు, ఏన్ని సీతారాం, శాంతిమూర్తి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణ పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న వైకాపా

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : రాజధాని విషయమై వైకాపా మంత్రులతో పాటు శాసనసభ స్పీకర్ కూడా అసభ్యంగా మాట్లాడుతున్నారని, దీని వలన మూడు ప్రాంతాల ప్రజల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ ప్రాపకం కోసం వాడుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఆరోపించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఒకే రాజధాని అమరావతిలోనే నిర్మించేందుకు మద్దతు ఇచ్చిన జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టాక వికేంద్రీకరణ పేరుతో మూడు ప్రాంతాల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వేసిన రోడ్లన్నింటికీ కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో విపరీతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మడ్డువలస, వంశధార, తోటపల్లి, నాగావళి నదుల నుంచి సాగునీరు సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు జిల్లాకు సంబంధించిన మంత్రులు కూడా పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాకు సంబంధించి ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పూర్తి చేస్తే 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఒక ఎకరాకు 30 బస్తాలు పండించేందుకు వీలవు తుందన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు డీ సెంట్రలైజేషన్ గురించి మాట్లాడే అర్హతలేదన్నారు. రాజధాని విషయంలో చంద్రబాబునాయుడు ఏ విధంగా నిర్లక్ష్యం వహించి ఆక్షేపించబడ్డారో అదే విధంగా జగన్మోహనరెడ్డి కూడా తన పంథాను కొనసాగిస్తూ ప్రజలవద్ద అబాసుపాలవుతున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఆ ఇళ్లకు జగనన్న గృహకల్ప పేరు పెట్టే అర్హత వైకాపా ప్రభుత్వానికి లేదన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కేంద్ర ప్రభుత్వం చేస్తుందనే తప్పుడు ప్రచారం కొన్ని పార్టీలు కావాలనే చేస్తున్నాయని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. రైల్వేజోన్ విషయమై ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవలే అనుకూలమైన ప్రకటన చేశారని, ఈ రైల్వేజోన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్వరలో మోడీ రానున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అట్టాడ రవిబాబీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి బాలాదిత్య, బీజేపీ నాయకులు శవ్వాన వెంకటేశ్వరరావు, రెడ్డి నారాయణరావు, నడికుదిటి ఈశ్వరరావు, సంపతి రావు నాగేశ్వరరావు, పండి యోగీశ్వరరావు, పాతిన గడ్డెయ్యతోపాటు బీజేపీ నాయకులు ఉన్నారు. అనంతరం త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదుపై నియోజకవర్గ, మండలాల వారీగా నమోదైన ఓటర్ల జాబితాలపై సమావేశం నిర్వహించారు.

వాడవాడలా ఘనంగా నాగుల చవితి

విశాలాంధ్ర-నందిగాం : మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పొలాల గట్ల పైన, కల్లాల్లో ఉన్న పుట్టలను శుభ్రం చేసి మంచి ముగ్గులు వేసి, పిండి పువ్వులతో అలంకరించి పుట్టలో పాలు పోశారు. కొంతమంది కోడిగుడ్లను పుట్టలో వేసి పూజలు చేశారు.

సంతబొమ్మాళిలో : నాగుల చవితి కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళి మండలంలో వాడవాడలా శనివారం జరిగాయి. సాంప్రదాయం ప్రకారం పాములు పుట్టలవద్ద పాలు, గుడ్లు, ప్రసాదాలు సమర్పించారు. ఇందులో భాగంగానే ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు. అలాగే జెడ్పిటిసి హనుమంతు నాయుడు పేటలో, నాగుల చవితి కార్యక్రమం సందర్భంగా సతి సమేతంగా పూజలు నిర్వహించారు.

కవిటిలో : మండలంలోని కవిటి, జగతి, బొరివంక, బెజ్జిపుట్టుగ, ప్రగడపుట్టుగ, తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా వేకువజామున భక్తులు తల స్నానం ఆచరించి గ్రామ శివార్లలో ఉండే పుట్టల వద్దకు చేరుకొని భక్తి శ్రద్ధలతో పాలు, కోడి గ్రుడ్లు, వడపప్పు, చలిమిడి, పాయసం నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేపట్టారు. ఈ పూజ చేయడం వల్ల అష్ట ఐశ్వర్య, ఆయురా రోగ్య, భోగభాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

పాలకొండలో : పట్టణంలో శనివారం నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచే పొలాల్లోకి వెళ్లి భక్తి శ్రద్ధలతో నాగదేవతను కొలిచారు. ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది కూడా అనేక దేవాలయాలు నాగుల చవితి సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది.

సీతంపేటలో : మండలం ఏజెన్సీ ప్రాంతంలో నాగుల చవితి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. పుట్టల వద్ద పూజలు చేసి, నాగేంద్రుడికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు నాగేంద్రుడు కరుణాకటాక్షాలు ప్రజలందరకు అందించాలని కోరుతూ గుడులు, గోపురాలు వద్ద పూజలు చేశారు. పురాతన కాలం నుండి నాగుల చవితికి ప్రత్యేకమైన ఆనవాయితీతో నాగ పూజ చేయడం పాములను ఆరాధ్య దైవంగా పూజించి ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చెవులు బాగా వినిపించే విధంగా పుట్టమన్నును బొట్టు పెట్టుకుని, చెవులకు బొట్టు పెట్టుకోవడం జరుగుతుందని పూర్వీకులు తెలిపారు.

ఇచ్ఛాపురంలో : శనివారం పట్టణం, మండలంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాగుల చవితిని వేడుకగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండి శివాలయాలు, సమీపంలో పుట్టల వద్దకు చేరి ముగ్గులతో అలంకరించి, నాగ దేవతకు పాలు పోసి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. ఆధునీకరణ నేపథ్యంలో పుట్టలు చాలా చోట్ల కనుమరుగవ్వడంతో ప్రజలు పుట్టల కోసం ప్రత్యేకంగా అన్వేషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో శ్రీ చిదంబరేశ్వరాలయం, శ్రీ రామలింగేశ్వరాలయం, నీలకంఠేశ్వర, తారకేశ్వరాలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పాతపట్నం/కొత్తూరులో : రైతన్నలకు ముఖ్యమైన నాగుల చవితి పర్వదినాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సంప్రదాయ బద్ధంగా జరులుకున్నారు, తన నివాసం పాతపట్నంలో ఆమే ఉదయాన్నే గ్రామనికి దూరంలో నున్న పుట్ట వద్దకు వెళ్లి పుట్టలో పాలు పోసి, ఉండ్రాలు వేసి పూజలు జరిపారు .పలువురు మహిళలు కూడా ఎమ్మెల్యే శాంతితో పుట్ట వద్దకు తోడుగా వెళ్లి పూజలు జరిపారు,

వికేంద్రీకరణపై గడప గడపకూ అవగాహన

విశాలాంధ్ర-బూర్జ : పరివర్తన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం అయిన అధికార వికేంద్రీకరణతో పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం అనే అంశంపై ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమానికి ఆమదాలవలస నియోజకవర్గం వైసీపీ నాయకులు చింతాడ రవికుమార్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా శనివారం మండలంలోని తోటవాడ గ్రామంలో గడప గడపకూ వెళ్ళి విశాఖపట్నం రాజధాని ఏర్పాటు వలన జరిగే అభివృద్ధిని వివరించారు. విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా ఏర్పడి భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో అత్యధికంగా లాభం పొందే జిల్లా శ్రీకాకుళం జిల్లా అవుతుందని, జాతీయ రహదారుల కనెక్టివిటీ తో శ్రీకాకుళం జిల్లాలోని భూముల విలువలు పెరగడం, పెట్టుబడులు వచ్చి పారిశ్రామిక వాడలు ఏర్పడడం, ఐటీ హబ్ ఏర్పడడం దీంతో ఉపాధి అవకాశాలు మెండుగా పెరిగి రాష్ట్రంలో అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాగా శ్రీకాకుళం జిల్లా అవతరిస్తుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఉత్తరాంధ్రకు విశాఖపట్నం పరిపాలనా రాజధాని, ఆంధ్ర ప్రాంతానికి అమరావతిలో శాసన రాజధాని, శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ ప్రాంతానికి కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళాలని ప్రయత్నిస్తున్నారని తెలియజేశారు.

మన ప్రాంతం నుండి వలసలు ఆగాలంటే విశాఖపట్నం రాజధాని కావడం కంటే వేరొక పరిష్కారమార్గం లేదని వివరించారు. దీనిపై చంద్రబాబునాయుడు చేస్తున్న విషప్రచారమంతా తన స్వార్థ ప్రయోజనాలు, టీడీపీ మనుగడ కోసమేనని ఇందులో భాగంగానే పెయిడ్ ఆర్టిస్టులను పెట్టి భూటకపుయాత్రలు చేయిస్తున్నాడని గ్రామ ప్రజలకు వివరించారు. టీడీపీ నేతలు కుట్రపూరిత ఆలోచనలతో మన ప్రాంతవాసుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు వారి మాయ మాటలు నమ్మి టిడిపి ఉచ్చులో పడవద్దని మనప్రాంతానికి ఇంత పెద్ద మేలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిగారికి పార్టీలకతీతంగా ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో విశేష స్పందన వస్తుందని, ఈ ప్రాంత ప్రజలంతా జగనన్న నిర్ణయాన్ని ముక్తకంఠంతో స్వాగతిస్తున్నారనడానికి ఇదే ఒక ఉదాహరణని చెప్పారు. ఈకార్యక్రమంలో పరివర్తన్ ట్రస్ట్ సభ్యులు, బూర్జ మండలానికి చెందిన ప్రజలు, తోటవాడ గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొనడం జరిగింది. ఇదే ఉత్సాహంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపడతామని ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు.

31న స్వంచ్ఛంద సంస్థల రౌండ్ టేబుల్ సదస్సు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : విశాఖపట్నం పరిపాలన రాజధాని ఏర్పాటును స్వాగతిస్తూ ఈ నెల 31న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సిల్వర్ జూబ్లీ హాల్ లో స్వంచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని లైన్స్ క్లబ్ చైర్మన్ మరియు స్వంచ్ఛంద సంస్థల సమాఖ్య కన్వీనర్ హరికా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రాజధానులు ఏర్పాటు ద్వారా రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరగటానికి ఆస్కారం వుంటుందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని, దీన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ స్వాగతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉత్తరాంధ్ర సాధనకు అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ధర్మాన ప్రసాదరావు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని హరికా ప్రసాద్ స్పష్టం చేశారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని సాధనకు అన్ని వర్గాలు కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ ఓటరు పాత జాబితా రద్దు : ఆర్డీవో

విశాలాంధ్ర-కాశీబుగ్గ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాత ఓటరు జాబితా రద్దు అయినట్లు పలాస ఆర్డీవో టి.సీతారామ్మూర్తి అన్నారు. శనివారం పలాస తహాశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అందుకు గ్రామాల్లో డిగ్రీ, ఆపై చదువుకున్న వారికి సమాచారం చేరే వేయాలన్నారు. 2019 ఏడాదిలో డిగ్రీ పట్టా పొందిన వారే ఈ ఎన్నికలకు అర్హులని చెప్పారు. ఓటరు నమోదుకు డిగ్రీ పట్టా జిరాక్స్, ఆ జిరాక్స్‌పై గజిటెడ్ సంతకం చేయడంతోపాటు ఆధార్ కార్డు, ఫోటో తప్పనిసరిగా జత చేయాలన్నారు. తహాశీల్దారు, ఎంపిడివో కార్యాలయాల్లో ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదుకు ధరఖాస్తు చేసుకోవచ్చని, నవంబరు 7వ తేదీ వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహాశీల్దార్ ఎల్.మధుసూధనరావు, పలాస ఆర్డీవో కార్యాలయం ఇన్‌చార్జ్ ఎ.వో రామారావు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌ను ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-పాలకొండ : మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి, శనివారం పరామర్శించారు. లక్ష్మణరావు కుమారుడు ముఖేష్(16) మరణవార్త తెలుసుకొని తెట్టంగి గ్రామం వెళ్లి పరామర్శించారు. లక్ష్మణ కుమారుడు మృతదేహాన్ని చూసి ఎమ్మెల్యే చలించి పోయి కన్నీరు మున్నీరయ్యారు. సందర్భంగా ప్రాంతమంతా అందరూ ఒక్కసారిగా శోక సంద్రంలో మునిగిపోయారు. రాజకీయ యువ నాయకుడుగా పేరు తెచ్చుకుంటున్న లక్ష్మణ కుటుంబానికి ఓదార్చారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నియోజకవర్గ ఫాస్టర్ కమిటీ ఎంపిక

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదలవలస పట్టణ లో ఉన్న ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో శ్రీకాకుళం జిల్లా ఉత్తరాంధ్ర జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, డాక్టర్ గంజి ఎజ్రా జిల్లా అధ్యక్షులు రెవ, గంట సంపత్ కుమార్ మరియు అడ్వైజర్ కుమార్ రాజు సమక్షంలో ఆమదాలవలస నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ అధ్య క్షులుగా పాస్టర్ టీ, జార్జిముల్లరు ఉపాధ్యక్షులుగా పాస్టర్ ఎం షడ్రక్ బాబు, సెక్రటరీగా పాస్టర్ మోజెస్ కమలాకర్, ట్రెజరర్ పాస్టర్ స్టీవెన్, గౌరవ అధ్యక్షులుగా పాస్టర్ జాన్ పీటర్, పాస్టర్ జి సామ్యూల్ అరుణ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్‌గా తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా నూతనంగా నియోజకవర్గ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన పాస్టర్ జార్జిముల్లర్ మాట్లాడుతూ క్రైస్తవ సంక్షేమ అభివృద్ధికి క్రైస్తవుల సమస్యల పట్ల వాటి పరిష్కారానికి ఈ నూతన కమిటీ కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంలో జిల్లా కమిటీ వారికి నూతన కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు.

బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో కడగండి, సోమగండి, పుబ్బడ గ్రామ సచివాలయాల్లో బోయ, వాల్మీకి, బెంతు వరియాలను ఎస్టీ జాబితాలో చేర్చ వద్దంటూ మెమోరాండాలను కడగండి గ్రామ సచివాలయం పరిధిలో రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మారావు, సోమగండి సచివాలయంలో సర్పంచ్ ప్రతినిధి ఎస్ గోపాల్, పుబ్బడ పంచాయతీలో జనార్ధన్ మాస్టర్ ఆధ్వర్యంలో శామ్యూల్ కమిషన్ రద్దు చేయాలని వినతి పత్రాలను ఎంపీడీవో గీతాంజలి కి అందించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

అక్టోబరు 31 నుంచి జీ తెలుగులో 'అమ్మాయిగారు' ధారావాహికం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అద్భుతమైన కథ-కథనాలు, ప్రేక్షకుల్ని కట్టిపడేసే మలుపులతో గత కొన్నేళ్లుగా ప్రేక్షక లోకాన్ని ఎంటర్‌టైన్ చేస్తున్న జీ తెలుగు ఎప్పటిలాగే ఇప్పుడు కుడా ఒక విభిన్న కథాంశంతో 'అమ్మాయిగారు' అనే సరికొత్త ధారావాహికతో ముందుకు రాబోతుందని జీ తెలుగు ప్రాంతీయ ప్రతినిధి చెప్పారు. అక్టోబర్ 31 న ప్రారంభం కానున్న ఈ సీరియల్ సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 9.30లకు ప్రసారం కానుందన్నారు. అమ్మాయిగారు' - తండ్రి ప్రేమ కోసం తపన పడే కూతురు, కూతురిని దూరంగా పెట్టే తండ్రి, ఈ ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రతీ ఒక్కరికి నచ్చుతాయన్నారు. అమ్మాయిగారు సీరియల్‌పై అంచనాలు పెరిగాయని, ఈ సీరియల్ ఎప్పుడెప్పుడు ప్రసారం అవుతుందా అని ఆడియన్స్ వెయిట్ చేస్తున్నారన్నారు. అమ్మాయిగారు కథ రూప, ప్రతాప్ సూర్యదేవ్, రాజు అనే మూడు పాత్రల చుట్టూ తిరుగుతుందన్నారు. రూప పుట్టింది, పెరిగింది డబ్బున్న కుటుంబంలో అయినా తండ్రి ఆలనాపాలనకు, ప్రేమానురాగాలకు దూరం అవుతుందని, అయితే గతంలో జరిగిన ఒక సంఘటనతో తన భార్యపై ఉన్న కోపాన్ని రూపపై చూపిస్తుంటాడు ప్రతాప్ సూర్యదేవ్. కానీ రూప మాత్రం ఎప్పటికైనా తండ్రి తన మమకారాన్ని అర్థం చేసుకుంటాడని ఎదురుచూస్తుంటుందన్నారు. రూప తన తండ్రి ప్రేమను తిరిగి పొందుతుందా.? అనేది తెలియాలంటే అక్టోబర్ 31 నుంచి జీ తెలుగులో ప్రసారం అయ్యే అమ్మాయిగారు సీరియల్ చూడాలని కోరారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మండలంలో నాగుల చవితి వేడుకలు వాడవాడలా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రకృతి పూజలో భాగంగా పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిష్టప్పపేటలో కుటుంబ సభ్యులతో టీడీపీ యువ నాయకులు గొండు శంకర్ నాగుల చవితి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రజలు పుట్టల కోసం గ్రామీణ ప్రాంతాలకు బారులు తీరారు.

ఏమి చెత్త పనులు..!

- పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నం... పేరుకుపోయిన చెత్త
- అధికారుల నిర్లక్ష్యం... రోగాల బారిన ప్రజలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పరమ అధ్వాన్నంగా మారింది. అధికారుల అలసత్వంతో నిర్వహణ లేక ఎక్కడికక్కడే చెత్త దర్శనమిస్తుంది. వీటి నుండి వెలువడే దుర్గంధంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. ప్రజారోగ్యంపై పురపాలక సంఘ అధికారులకు ముందుండే అధికారులు అపరిశుధ్య నిర్వహణలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడికక్కడే చెత్త పోగులు, మురుగు నీరుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా రెండు కోట్ల ఎనిమిది లక్షలు రూపాయల నిధులు పారిశుధ్య నిర్వహణకు వెచ్చిస్తున్నప్పటికీ ఆ పట్టడంలేదని ప్రజలు వాపోతున్నారు. పేరుకుపోయిన చెత్త ద్వారా విడుదలయ్యే దుర్వాసన ముక్కు పుటలదిరే దుర్గంధంతో డెంగ్యూ మలేరియా ఒంటి జ్వరాల బారిన పడి ఆసుపత్రి పాలౌవుతున్నారు. ప్లాస్టిక్ నిర్వహణ అంతంత మాత్రం కావడంతో మురికి కాలువల నిండా ముచ్చి సంచలే దర్శనమిస్తున్నాయి. వీధుల్లో మురుగునీరు రోడ్లపై దర్శనమిస్తుంది. చెత్త పన్ను వసూలు మొత్తాలు మురుగునీరులోనే కలిసిపోతున్నాయి. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానంలో 78 మంది పారిశుధ్య పని వారిలో ఉన్నప్పటికీ కనీసం పట్టణ ప్రధాన రహదారులు కూడా మెరుగుపరచడం లేదు. ఇందులో సగం మంది అధికారులు నేతలు ఇళ్ల వద్ద పనులకే కాలం గడిచిపోతుంది అనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస మౌలిక సదుపాయాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడం తోనే ఈ దుస్థితి నెలకుంటుంది.

పారిశుధ్య నిర్వహణకు సానిటరీ ఇన్స్పెక్టర్ స్థానికంగా లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారింది. కనీసం రోజులో ఒకసారైనా వివేక్షిస్తే పారిశుధ్యం మెరుగుపడేదని స్థానికులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పారిశుధ్యం పై పాలకులు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోకపోతే మరింత అధ్వాన స్థితిలో ఆమదాలవలస మారుతోందడంలో సందేహం లేదు.